# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 20-9-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 42 పేజీలు:6 వెల: రూ.1/-


## పర్యాటక ప్రాంతాలు, పండుగలను మార్కెటింగ్ చేయండి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. హిమాచల్ ప్రదేశ్ లోని ధరంశాలలో జరుగుతున్న వివిధ రాష్ట్రాల పర్యాటక మంత్రుల సదస్సులో రెండోరోజు ఆయన అక్కడి ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్, పర్యాటక శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అరుణాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, తమిళ్ నాడు, మిజోరాం, బీహార్, అస్సాం, గోవా, మహారాష్ట్ర, ఒడిశా, జమ్మూ కాశ్మీర్, లదాఖ్, రాజస్థాన్, కర్ణాటక, మణిపూర్, సిక్కిం రాష్ట్రాల మంత్రులు, కార్యదర్శులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

## 21న రాష్ట్ర వ్యాప్తంగా టీఎస్ పీఈసెట్ ఎగ్జామ్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (టీఎస్ పీఈసెట్-2022) నిర్వహణకు నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 21న (బుధవారం) నిర్వహించనున్న పరీక్షకు నాలుగు జిల్లాల్లో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఫిజికల్ ఈవెంట్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 3,632 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. సోమవారం రాత్రి వరకు 3,552 మంది అభ్యర్థులు తమ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఒకే రోజు పురుషులకు, మహిళలకు వేర్వేరుగా పరీక్షలు పూర్తి చేసేలా ఏర్పాట్లు చేశారు. సెట్ చైర్మన్‌గా ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్.గోపాల్‌రెడ్డి, కన్వీనర్‌గా ఎంజీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ వ్యవహరిస్తున్నారు.

ఎంజీయూలో పరీక్షల ప్రారంభోత్సవానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి హాజరు కానున్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా కేంద్రాల్లో ఈ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అభ్యర్థులు ఒక గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సంబంధిత అధికారులు సూచించారు. అదేవిధంగా ప్రత్యేక కేటగిరి (ఎన్‌సీసీ, ఎక్స్ సర్వీస్‌మెన్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ తదితర) అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

**పరీక్ష కేంద్రాలు ఇవే..**

1. మహాత్మాగాంధీ యూనివర్సిటీ, నల్లగొండ
2. శ్రీకృష్ణ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, శ్రీనాథపురం, అనుముల మండలం, నల్లగొండ జిల్లా
3. ఎంఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, చౌటుప్పల్, యాదాద్రి భువనగిరి జిల్లా
4. సిద్దార్థ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, వినోభానగర్, ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి జిల్లా
5. వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, బొల్లికుంట, వరంగల్ అర్బన్ జిల్లా
6. వేదా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, కొండపాక, సిద్దిపేట

## కేంద్రం, ఈసీ, ఏపీ, తెలంగాణకు సుప్రీంకోర్టు నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 19: కేంద్రం, ఈసీ, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణలో అసెంబ్లీ సీట్లను 119నుంచి 153కు పెంచాలని పిటిషన్ వేసింది. అలాగే ఏపీలో అసెంబ్లీ సీట్లను 175నుంచి 225 వరకు పెంచాలని పిటిషన్ లో పేర్కొన్నారు. విభజన చట్టం నిబంధనలను అమలు చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని పిటిషన్ వేశారు. కేంద్రం, ఈసీ, ఏపీ, తెలంగాణలను పిటిషనర్ ప్రతివాదులుగా చేర్చారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు కేంద్రం, ఈసీ, ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.

## రుణాల ద్వ్యా ఒక్క పైసా లేకుండా వంద శాతం రికవరీ చేయాలి



మెదక్, సెప్టెంబర్ 19 : నేటినిజం (ప్రతినిధి):బ్యాంక్ లింకేజ్ లో భౌతిక, ఆర్థిక లక్ష్యాల మేరకు ఈ నెల చివరి నాటి 60 శాతం లలక్ష్యాలను సాధించే దిశగా కృషిచేయవలదినదిగా డిఆర్డీ ఓ శ్రీనివాస్ ఏ.పీ. ఎమ్ లను ఆదేశించారు. సోమవారం తమ కార్యాలయంలో సెర్ఫ్ కార్యక్రమాలను సమీక్షిస్తూ మండలాల వారిగా నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తూ, రుణాల ద్వ్యా ఒక్క పైసా లేకుండా వంద శాతం రికవరీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయేతర కార్యక్రమాల పై కూడా సమీక్షించారు. ఈ సమావేశంలో అడిషనల్ డి ఆర్ డి ఓ భీమయ్య , డిపిఎంలు ప్రకాష్, మోహన్ ,వెంకట్, అన్ని మండలాల ఙఖఓ లు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త.. అక్టోబర్ జీతంతోపాటు డీఏ చెల్లింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 19: వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి అన్ని ఆర్టీసీ డిపోలను లాభాల బాట పట్టించే దిశగా మరిన్ని నూతన సంస్కరణలు తీసుకురానున్నట్లు టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ వెల్లడించారు. ఆదాయం పెంపు ? నష్ట నివారణ చర్యల్లో భాగంగా ఇప్పటికే ఆదాయం పెంచుకునేందుకు 30 రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రయాణీకులు, సంస్థ సిబ్బంది కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టామన్నారు. సంస్థ సిబ్బందికి ఇవ్వల్సిన బాకాయిలను పూర్తి స్థాయిలో చెల్లించి వారికి అన్ని విధాల సహకారం అందజేస్తామన్నారు. సిబ్బంది పూర్తి విశ్వాసంతో సైనికుడిలా పని చేయాలని ఆయన కోరారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 19: తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రిలో సిబ్బంది కోసం మరిన్ని సౌకర్యాలు మెరుగుపరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫాదర్స్ డే, మదర్స్ డే, చిల్డ్రన్స్ డే, తదితర జాతీయ పండుగలను దృష్టిలో ఉంచుకుని పెద్దలకు, పిల్లలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వంటి వినూత్న కొత్త పథకాలను అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజు తిరుపతికి వెయ్యిమంది ప్రయాణీకులను టీఎస్ ఆర్టీసీ చేరవేస్తుందని, బస్సులోనే దర్శనం టిక్కెట్లను అందజేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఆర్టీసీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి ఏడాది కాలాన్ని బాజిరెడ్డి గోవర్దన్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీలో చేపట్టిన పలు కార్యక్రమాలను సోమవారం ఒక ప్రకటనలో ఆయన విడుదల చేశారు. 2022-23లో 300 కొత్త ఎలక్ట్రికల్ బస్సులు ప్రవేశపెడతామన్నారు. హకీంపేట, వరంగల్‌లో రెండు ఐటీఐ కాలేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే 1200 కారుణ్య నియామకాలు చేపడతామన్నారు. ఆర్టీసీ ప్రత్యేక బ్రాండ్ పేరుతో జీవ వాటర్ బాటిళ్ళను ప్రవేశపెడతామన్నారు. అలాగే సూపర్ లగ్జరీ, డీలక్స్ స్లీపర్ క్లాస్ బస్సులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సంస్థలో పని చేస్తున్న సిబ్బందికి ఈ ఏడాది అక్టోబర్ నెల జీతంతో పాటు డీఏను అందజేస్తామన్నారు. ఆర్టీసీని లాభాల బాట పట్టించే లక్ష్యంతో పనిచేస్తున్న సంస్థ ఎండీ సజ్జనార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, రీజినల్ డైరెక్టర్లు, డిపో మేనేజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ స్టాఫ్‌కు ప్రత్యేక అభినందనలు బాజిరెడ్డి గోవర్దన్ తెలిపారు.

## అక్టోబర్ 18న ఎంబీఏ, ఎంసీఏ మొదటి విడత సీట్లు కేటాయింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 19: టీఎస్ ఐసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ సోమవారం విడుదలైంది. అక్టోబర్ 8వ తేదీ నుంచి ఐసెట్ తొలివిడత కౌన్సెలింగ్ ప్రారంభం కానున్నట్లు సాంకేతిక విద్యాశాఖ ప్రకటించింది. అక్టోబర్ 8 నుంచి 12 వరకు స్లాట్ బుకింగ్ ఉంటుందని, ధృవపత్రాల పరిశీలనకు 10 నుంచి 13 వరకు అవకాశం కల్పించారు. అక్టోబర్ 10 నుంచి 15వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదుకు అవకాశం కల్పించగా 18న ఎంబీఏ, ఎంసీఏ మొదటి విడత సీట్లను కేటాయించనున్నారు.

18 నుంచి 21వ తేదీల్లో ట్యూషన్ ఫీజును చెల్లించి సీటు పొందిన కాలేజీల్లో ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. అక్టోబర్ 23 నుంచి తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ జరగనుంది. 23 నుంచి 25 వరకు తుదివిడత వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోగా 28న ఎంబీఏ, ఎంసీఏ తుదివిడత సీట్లను కేటాయిస్తారు. అదే రోజు స్పాట్ అడ్మిషన్ల కోసం మార్గదర్శకాలు విడుదల చేయనున్నారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి జులై 28న కాకతీయ యూనివర్సిటీ ఐసెట్ ఎంట్రెన్స్‌ను నిర్వహించగా ఆగస్టు చివరి వారంలో ఫలితాలు విడుదలైన విషయం తెలిసిందే.

## దసరాకు 1,081 అదనపు బస్సులు : ఏపీఎస్ ఆర్టీసీ

హైదరాబాద్, సెప్టెంబర్ 19: దసరా పండుగ నేపథ్యంలో అదనపు బస్సులు నడపాలని ఏపీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. విజయవాడ నుంచి పలు ప్రాంతాలకు 1,081 అదనపు బస్సులు నడుపనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు ప్రత్యేక బస్సు లు అందుబాటులో ఉండనున్నాయి. విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖ, రాజమహేంద్రవరం, కాకినాడ, తిరుపతి, అమలాపురం, భద్రాచలం ఏరియాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ ఛార్జీలే వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రత్యేక బస్సుల్లో రిజర్వేషన్ సదుపాయం కూడా కల్పించారు. ఏపీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో ప్రత్యేక బస్సుల వివరాలను అధికారులు అందుబాటులో ఉంచారు.

## విపత్తు నిర్వహణ బాధ్యత రాష్ట్రానిదే.. కేంద్రం బృందం నివేదిక ఆధారంగా అదనపు సాయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: విపత్తులు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రాథమిక బాధ్యత రాష్ట్రానిదేనని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా సంభవించిన నష్టంపై కేంద్ర బృందాలు పర్యటించి సహాయం అందించాలని కోరుతూ రాజ్యసభ జీరో అవర్లో ప్రస్తావించిన తెలుగుదేశం సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్‌కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. విపత్తు నిర్వహణ బాధ్యత రాష్ట్రాలదేనని, అయితే ఆ విపత్తు తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు పరిస్థితిని అంచనా వేసి కేంద్రం అదనపు ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలిపారు.

ఈ ఏడాది గోదావరి నది వరదల కారణంగా జరిగిన నష్టంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంటర్ మినిస్ట్రీరియల్ సెంట్రల్ టీమ్ (ఐఎంసీటీ) వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించినట్టు కేంద్ర మంత్రి తెలిపారు. ఈ కేంద్ర బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అదనపు ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరం కోసం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్డీఆర్ఎఫ్) కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ. 1,2522.80 కోట్లు మంజూరయ్యాయని, ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ. 940 కోట్లు కాగా ఏపీ ప్రభుత్వ వాటా రూ. 312.80 కోట్లు అని తెలిపారు

## కాళికామాతను దర్శించుకున్న మంత్రి తలసాని



హైదరాబాద్, సెప్టెంబర్ 19: కోల్‌కతాలోని శ్రీ కాళికామాత అమ్మవారిని సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పూజల అనంతరం మంత్రిని ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు మంత్రి తెలిపారు.

## తెలంగాణ... బతుకమ్మ ఉత్సవాల డేట్ ఖరారు

హైదరాబాద్, సెప్టెంబర్ 19: తెలంగాణలో ఈనెల 25 నుంచి అక్టోబర్ 3 వరకు బతుకమ్మ ఉత్సవాలు జరగనున్నాయి. బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని టీఎస్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 3న ట్యాంక్‌బండ్ దగ్గర ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. బీఆర్‌కే భవన్‌లో సమన్వయ సమావేశం జరిగింది. ఈ భేటీలో ప్రభుత్వ సలహాదారు రమణాచారి, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఆయాశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ నెల 25 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు బతుకమ్మ వేడుకలకు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు.

## తెలంగాణలో 5400 మెగావాట్లకు పెరిగిన పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం




హైదరాబాద్, సెప్టెంబర్ 19: రాష్ట్రంలో రెన్యూయెబుల్ ఎనర్జీ సామర్థ్యం పెంపుపై తెలంగాణ రెన్యూయెబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక శ్రద్ధ వహించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో సోమవారం ఇన్వెస్ట్‌మెంట్ బజార్ ఫర్ ఎనర్జీ ఎఫిషియెన్సీ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించింది. కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ), బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సహకారంతో తెలంగాణ రెన్యూయెబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. విద్యుత్ రంగ కంపెనీలు, ఆర్థిక సంస్థలు, పరికరాల తయారీదారులు, పరిశ్రమలు, ప్రభుత్వం, ప్రైవేట్ అధికారులు అందరిని ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని పెంచేందుకు చేపట్టే ప్రాజెక్టులకు మంచి ఫైనాన్షియల్ సదుపాయాలపై ఈ కార్యక్రమంలో చర్చించారు.

ఈ సందర్భంగా తెలంగాణ రెడ్కో చైర్మన్ వై సతీశ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ సామర్థ్య పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా విద్యుత్ రంగంలో వేగవంతమైన మార్పు తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భవిష్యత్‌లో రాబోయే విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు ఇది తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారమని ఆయన చెప్పారు. విద్యుత్ వినియోగం లేని భవనాన్ని 2591 చదరపు మీటర్ల విస్తీర్ణంలో తెలంగాణ రెడ్కో నిర్మించబోతోందని చెప్పారు. ఇది మొట్టమొదటి పర్యావరణ అనుకూల భవనమని రెడ్కో చైర్మన్ సతీశ్ రెడ్డి తెలిపారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం 70 మెగావాట్లుగా ఉండేదని.. ఇప్పుడు అది 5400 మెగావాట్లకు చేరిందని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి, విద్యుత్ ఉత్పత్తి, పొదుపులో స్థిరమైన పద్ధతుల ప్రోత్సాహం వల్లే ఇది సాధ్యమైందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రెన్యూయెబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వై సతీశ్ రెడ్డి, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ జాయింట్ డైరెక్టర్ శ్యాంసుందర్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజర్ పీయూష్ దత్ పాండే, తెలంగాణ రెడ్కో వైస్ చైర్మన్, ఎండీ ఎన్ జానయ్య, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు. పరిశ్రమలు, ఫైనాన్స్ సంస్థల అనుసంధానంలో ఈ వేదిక ముఖ్యభూమిక పోషించిందని వక్తలు అభిప్రాయపడ్డారు.

## చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి : గూడూరి ప్రవీణ్



హైదరాబాద్, సెప్టెంబర్ 19: చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలంగాణ మరమగ్గాల, జౌళి అభివృద్ధి కార్పొరేషన్ సంస్థ గూడూరి ప్రవీణ్ అన్నారు. రాష్ట్ర మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో ఆయన మరమగ్గాల, జౌళి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మరమగ్గాలు, జౌళి పరిశ్రమల సమగ్రాభివృద్ధి కోసం జౌళీ రంగాల్లో ఆధారపడిన కార్మికులకు నిరంతరం పని కల్పించడంతో పాటు పవర్‌లూం వస్త్రాలకు మార్కెట్ సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాశ్ జ్యోతి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, నారదాసు లక్ష్మణ్‌రావు, బసవరాజు సారయ్య, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో పాటు రాజన్న సిరిసిల్లకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు హైదరాబాద్‌లో మోస్తరు వర్షాలు..! ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 19: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో మళ్లీ వర్షాలు కురియనున్నాయి. గత కొద్ది రోజుల నుంచి నగరంలో ఎండలు దంచికొడుతున్న విషయం తెలిసిందే. సోమవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం కాస్త చల్లబడింది. రాత్రి సమయంలో పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. ఇక నగరంలో మంగళవారం తెలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు హైదరాబాద్ నగరానికి ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా కూడా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం వరకు 0.10 మి.మీ. నుంచి 2.40 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. చాంద్రాయణగుట్ట, రాజేంద్రనగర్, మలక్‌పేట, ఎల్బీనగర్, చార్మినార్, బండ్లగూడ, యూసుఫ్‌గూడ ఏరియాల్లో 2.50 మి.మీ. నుంచి 15.50 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది.

## పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులపై చట్టాలను కఠినంగా అమలు చేయాలి : మహిళా కమిషన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులపై చట్టాలను కఠినంగా అమలు చేసేందుకు ఢిల్లీ మహిళా కమిషన్ (డీసీడబ్ల్యూ) చొరవ తీసుకుంది. పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై లైంగిక వేధింపుల నిరోధక, నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేయడంలో లోటుపాట్లు ఉన్నాయని డీసీడబ్ల్యూ చీఫ్ స్వాతి మలివాల్ సోమవారం ఢిల్లీ అధికారులకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు.

ప్రతి జిల్లాలో కార్యాలయాలు, వాణిజ్య సంస్థల్లో లైంగిక వేధింపులపై ఫిర్యాదులు స్వీకరించే స్థానిక ఫిర్యాదుల కమిటీ (ఎల్‌సీసీ)లు ఇంకా అన్ని చోట్ల ప్రారంభం కాలేదని నివేదిక పేర్కొంది. ఆయా జిల్లాల్లో ఎల్‌సీసీల వివరాలను నిర్దిష్ట సమాచారం కోరుతూ జిల్లా మేజిస్ట్రేట్లకు నోటీసులు జారీ చేశామని తెలిపింది.

2019-21 నుంచి అన్ని ఎల్‌సీసీల పరిధిలో కేవలం 40 ఫిర్యాదులే వచ్చాయని తమ పరిశీలనలో వెల్లడైందని పేర్కొంది. ఢిల్లీలోని ఓ జిల్లాలో మూడేండ్లలో కేవలం మూడు కేసులే వచ్చాయని వెల్లడించింది. పశ్చిమ జిల్లాలో ఒక్క కేసు కూడా వెలుగుచూడలేదని నివేదిక తెలిపింది. తక్కువ ఫిర్యాదులు వచ్చిన చోట కూడా వీటిని సకాలంలో పరిష్కరించలేదని డీసీడబ్ల్యూ నివేదిక అసంతృప్తి వ్యక్తం చేసింది.

## 30న శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో బతుకమ్మ వేడుకలు



హైదరాబాద్, సెప్టెంబర్ 19: తెలంగాణలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బతుకమ్మ పండుగ వేడుకలు ఈనెల 25 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా 30వ తేదీన రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అమ్మపల్లి గ్రామంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో బతుకమ్మ పండుగ నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత నిర్ణయించారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా అమెరికన్ కౌన్సిలర్ జనరల్ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఆలయాన్ని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్, రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో కలిసి సందర్శించారు. బతుకమ్మ వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లను ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఆదేశించారు.

### చరిత్రలో నేటినిజం



(సెప్టెంబర్ 20 నటి కన్నాంబ జయంతి...)



-రాధశ్రీ

సెల్:9494481210

# పేదవర్గాలకు ప్రమాదకరంగా మారుతున్న పిల్లల కాన్సర్..!

## (సెప్టెంబర్ 'బాలల కాన్సర్ అవగాహన మాసం' సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట 4 లక్షల పిల్లలకు (0-19 ఏళ్ళ) కాన్సర్ నిర్ధారణ అవుతున్నది. భారతదేశంలో ఏడాదికి 50,000 మంది బాలలకు కాన్సర్ బారిన పడుతున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో పిల్లల కాన్సర్ త్వరగా తొలి దశలో నిర్ధారణ కావడంతో 80 శాతానికి పైగా పిల్లలు చికిత్స పొంది బయట పడుతున్నారు. పేద, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని బాలల కాన్యర్ రోగుల్లో 15-45 శాతం వరకు మాత్రమే తొలి దశలో గుర్తించబడుతూ వైద్యంతో రికవరీ అవుతున్నారు. పిల్లల బంగారు భవిత కోసమే తల్లితండ్రుల నిరంతర తపన. 'గోల్డ్ రిబ్బన్' పిల్లల కాన్సర్ అవగాహనను సూచిస్తుంది. పిల్లల కాన్సర్ పట్ల లోతైన అవగాహన కలిగి ఉండడం, బాలల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ విషయంలో పెద్దలు ప్రముఖ పాత్ర నిర్వహించడం జరగాలి. పిల్లల్లో కాన్సర్‌ను నివారించడం, నిర్ధారించడం అంత సులభం కాదు. పిల్లల కాన్సర్‌ను నయం చేయడానికి జనరిక్ ఔషధాలు, సర్జరీ, రేడియేషన్ చికిత్సలు వాడతారు. బాలల్లో కాన్సర్ నిర్ధారణ ఆలస్యం కావడం, అసలు నిర్ధారణే కాకపోవడం, నిర్ధారణలో దోషాలు, చికిత్స పూర్తిగా తీసుకోకపోవడం, ఔషధ దుష్ప్రభావాలతో మరణం అంచుకు చేరడం సాధారణంగా జరుగుతున్నది.

**పిల్లల కాన్సర్‌కు కారణాలు:**

అన్ని వయసుల, వర్గాల ప్రజలకు, అన్ని శరీర అవయవ భాగాలకు కాన్సర్ వ్యాధి రావచ్చు. కణాల్లో జన్యు మార్పులతో మె?దలై 'అపరిమిత వేగంగా కణ విభజన' జరిగిన కారణంగా శరీర ఇతర భాగాలకు వ్యాపించడంతో కాన్సర్ కణితి ఏర్పడుతుంది. నియంత్రణ లేని కణ విభజనతో ఏర్పడే ట్యూమర్లు కాన్సర్‌కు దారి తీస్తాయి. పిల్లలకు కాన్సర్ ఎలా వస్తుందో స్పష్టంగా తెలపడం కష్టం. సాధారణంగా పర్యావరణ కాలుష్యం, జీవనశైలి, అలవాట్లు, రేడియోషన్ లాంటి అంశాలు కాన్సర్‌కు దారి తీస్తాయి. హెచ్ఐవి, మలేరియా లాంటివి సోకిన వారిలో కాన్సర్ వచ్చే అవకాశం కూడా ఉండవచ్చు. కణాలు అపరిమితంగా అభివృద్ధి చెందడం, అసాధారణ ఆకృతులు/సైజుల్లో ఉండడం, తమ పరిధిని దాటి ఇతర శరీర భాగాలు/అవయవాలకు విస్తరించడం, ఇరుగు పొరుగు కణజాలాన్ని ధ్వంసం చేయడంతో కాన్సర్ వ్యాధి ప్రాణాంతకంగా మారుతుంది. పరోక్షంగా పొగ తాగడం (పాస్యూ స్మోకింగ్) కూడా పిల్లల్లో కాన్సర్‌కు కారణం కావచ్చని తల్లితండ్రులు తెలుసుకోవాలి.

**పిల్లల కాన్సర్‌లలో రకాలు:**

పిల్లల్లో కనిపించే కాన్సర్‌లలో ముఖ్యమైనవి కొన్ని మాత్రమే ఉన్నాయి. లుకేమియా (28శాతం బాలలకు), మెదడు / కేంద్రనాడీ మండలం (26 శాతం పిల్లలకు), న్యూరోబ్లాస్టోమా (6శాతం), నెఫ్రోబ్లాస్టోమా లేదా విమ్స్ ట్యూమర్ (5 శాతం), లింఫోమా (5 శాతం), రబ్డోమయోసర్కోమా (3 శాతం), రెటినోబ్లాస్టోమా (2 శాతం), ఎముకల కాన్సర్ లేదా ఆస్టియోసర్కోమా (3 శాతం పిల్లలకు) లాంటివి అతి ప్రధానమైన కాన్సర్స్‌గా నిర్ధారించ బడుతున్నవి.

**పిల్లల కాన్సర్ రోగలక్షణాలు:**

అసంబద్ధంగా బరువు తగ్గడం, దీర్ఘకాలపు తలనొప్పి, ఉదయం పూట వాంతులు, ఎముకలు/కీళ్ళు/వెన్ను/కాళ్ళ వాపులు, కణితి ఏర్పడడం, అకారణ అధిక రక్తస్రావం, తేలికగా అలసిపోవడం, కంటి చూపు మందగించడం, అసాధారణ జ్వరం లాంటివి కనిపిస్తాయి. పిల్లల కాన్సర్ రోగ లక్షణాలు రకాన్ని బట్టి మారతాయి.

**పిల్లల కాన్సర్ నిర్ధారణలు:**

రక్త పరీక్షలు, బయాప్సీ (కణజాల పరీక్షలు), ఎముకల మజ్జ పరీక్షలు/బయాప్సీ, లుంబార్ పంక్చర్, అల్ట్రాసౌండ్, సిటి/కాట్ స్కాన్, యంఆర్ఐ, పిఈటి-సిటి స్కాన్, రేడియో ఐసొటోపుల పరీక్షలు మె?దలగు కాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తారు.

**పిల్లల కాన్సర్ చికిత్సలు:**

పెడియాట్రిక్ ఆంకాలజీ విభాగ ఆసుపత్రులు పిల్లల కాన్సర్‌కు వైద్యం చేస్తాయి. పెద్దలతో పోల్చితే పిల్లల కాన్సర్‌లను నయం చేయడం సులభం. చికిత్సలో భాగంగా శస్త్రచికిత్సలతో పెరిగిన కణజాలాన్ని తొలగించడం, కీమోథెరపీతో ఔషధాల ప్రయోగంతో కణితి కణాలను చంపేయడం, రేడియేషన్ థెరపీలో వికిరణాలతో కాన్సర్ కణజాలాన్ని ధ్వంసం చేయడం, ఎముకల మజ్జ (బోన్ మారో) ట్రాన్స్‌ప్లాంటేషన్ లాంటివి వినియోగిస్తారు. కాన్సర్ రకం, కాన్సర్ తీవ్రత, పిల్లల వయస్సులను బట్టి కాన్సర్ చికిత్స ఆధారపడి ఉంటుంది.

పిల్లల కాన్సర్ అవగాహనకు లయన్స్ క్లబ్స్ చొరవ :

ప్రపంచవ్యాప్తంగా అతి పెద్ద సేవాసంస్థగా మన్ననలు పొందుతున్న లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ 200లకు పైగా దేశాల్లో 45,000 లయన్స్ క్లబ్బులతో 14 లక్షల లయన్స్ అనుదినం పలు ప్రజాహిత ఉచిత సేవలు అందిస్తున్నారు. ప్రపంచ దేశాల్లోని లయన్స్ క్లబ్బుల ద్వారా ప్రత్యేక కార్యక్రమంగా 'పెడియాట్రిక్ కాన్సర్' అవగాహనలు విద్యాలయాల్లో నిర్వహిస్తున్నారు. నేటి విద్యావంతుల సమాజం ఇలాంటి పిల్లల కాన్సర్‌ను అదుపు చేయడానికి అవసరమైన అవగాహనలు, సూచనలు చేయాలి. పిల్లల కాన్సర్‌కు అవగాహనే పరమ ఔషధమని గుర్తించిన లయన్ సేవా సంస్థలు తమ ప్రధాన 'సిగ్నేచర్ ప్రోగ్రామ్'గా చైల్డ్ కాన్సర్‌ను తీసుకొని మిలియన్ డాలర్ల ఖర్చు చేయడం హర్షదాయకం.

'సైలెంట్ కిల్లర్'గా పిలువబడే పిల్లల కాన్సర్ పట్ల పిల్లలకు పూర్తి అవగాహన కల్పించడం, అపోహల్ని తొలగించడం, భయాన్ని పారద్రోలడం, అర్థం చేసుకునేలా చూడడం లాంటివి కాన్సర్ చికిత్సకు దోహదపడతాయి. పిల్లల కాన్సర్‌ను త్వరగా గుర్తించడం/నిర్ధారించడంతో చికిత్స సులభం అవుతుంది. పిల్లల కాన్సర్‌కు జీవనశైలితో సంబంధం ఉండదు. తల్లితండ్రులు పిల్లల వద్ద లేదా ఇళ్లల్లో పొగ త్రాగరాదు. శరీరంలోని ఏభాగంలోనైనా కణితి ఏర్పడితే వెంటనే వైద్యున్ని సంప్రదించాలి. ఏ చిన్న అనారోగ్యమైన పెద్దలు అశ్రద్ధ చేయరాదు. పిల్లల కాన్సర్ నివారణ కుటుంబ పెద్దల చేతుల్లోనే ఉందని తెలుసుకొని ముందు జాగ్రత్తలు తీసుకుందాం. 'గోల్డ్ రిబ్బన్' అవగాహనతో బాలల బంగారు భవితకు పునాదులు వేద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037



జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను పురస్కరించుకొని జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మంజు శ్రీ జైపాల్ రెడ్డి, తెలంగాణ హ్యాండ్ లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్, జిల్లా ఎస్పీ రమణ కుమార్.

# మానుకోట జిల్లాలో గుర్తింపుకు నోచుకోని కవులు.

**–అక్షరసేద్యం అధ్యక్షుడు కస్తూరి పులేందర్.**



మహబూబాబాద్, సెప్టెంబర్ 19(నేటి నిజం ప్రతినిధి): తెలంగాణ విమోచన దినోత్సం సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో నిన్న అనగా ఆదివారం 18 సెప్టెంబర్ న జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా వివిద జిల్లా కేంద్రాలలో కవులను గుర్తించి వారిని సన్మానించడం జరిగింది. కాని మానుకోట జిల్లాలో కవులకు ఆ అవకాశమే దక్క లేదు అని మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రానికి చెందిన అక్షర సేద్యం సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకులు కస్తూరి పులేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిజాం రాజుకు వ్యతిరేకంగా తన సాహిత్యం ద్వార ముచ్చెమటలు పుట్టించిన మహా కవి దాశరథి పుట్టిన జిల్లాలోని కవులను, తెనుగు పత్రిక ద్వారా నిజాం ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఒద్దిరాజు సోదరులు పుట్టిన జిల్లాలో నాటి రజాకర్ల నుండి మొన్నటి వరకు జరిగిన తెలంగాణ ఉద్యమం వరకు ఎంతోమంది కవులు తమ రచనల ద్వారా ప్రజలను చైతన్యపరిచారు. అలాంటి మనుకోట జిల్లాలో ప్రభుత్వం కవులను గుర్తించకపోవడం బాధాకరమని అన్నారు. స్వాతంత్ర్య అమృతోత్సవాలలో కూడా మొక్కుబడిగా కవులను గుర్తించి తూతూ మంత్రంగా చేతులు దులుపుకున్నారని అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం మానుకోట జిల్లా కవులను గుర్తించి వారిని సత్కరించాలని డిమాండ్ చేసారు.




# సిఎం కెసిఆర్ ఒక అభినవ అంబేద్కర్ ...!

**–గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ సీఎం తీసుకున్న నిర్ణయం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది.**

**–తెలంగాణ సచివాలయానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టడం అణగారిన వర్గాల పట్ల సీఎం కి ఉన్న ఆదరాభిమానాలకు నిదర్శనం.**

**–తె-జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.**

సంగారెడ్డి సెప్టెంబర్ 19 (నేటి నిజం ప్రతినిధి) తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, స్వాతంత్ర్య సమరయోధులకు, కళాకారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.



జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్, జిల్లా ఎస్పీ రమణ కుమార్, తెలంగాణ చేనేత మరియు హ్యాండ్లూమ్స్ చైర్మన్ చింతా ప్రభాకర్, అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నరహరి రెడ్డి, సి డి సి చైర్మన్ బుచ్చిరెడ్డి, డిసిసిబి ఉపాధ్యక్షులు మాణిక్యం, తదితరులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు దేశ భక్తి, తెలంగాణ గేయాలతో ఉర్రూతలూగించగా , వివిధ పాఠశాలల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేసాయి.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో అమరుల త్యాగాల స్ఫూర్తి నిండాలన్న ఉద్దేశంతో ఏ రాష్ట్రంలో చేయని విధంగా స్వాతంత్ర్య వజ్రోత్సవాలు మన రాష్ట్రంలో 15 రోజులు చేసారన్నారు. అదేవిధంగా జాతీయ సమైక్యతను చాటేలా 16 నుండి 18 వరకు మూడు రోజులపాటు జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను జిల్లాలో ఘనంగా జరుపుకున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ పేద వర్గాల కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నదని పేర్కొన్నారు.

జిల్లా మంత్రి హరీష్ రావు అధికారులను, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేస్తూ , ముందుకు నడిపిస్తూ అన్ని విధాలా చేయూతనిస్తున్నారని తెలిపారు. తెలంగాణ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే దిశగా అందరూ సమైక్యంగా పనిచేయాలన్నారు.

తెలంగాణ గడ్డపై పుట్టిన గిరిజన బిడ్డగా తన మనసులోని మాటలను ఒక పౌరుడిగా చెబుతున్నానని , మన సీఎం అభినవ అంబేద్కర్ అని అన్నారు. అంబేద్కర్ ని చూడలేదు కానీ, ఈనాటి అభినవ అంబేద్కర్ ను చూస్తున్నానన్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితో సీఎం కేసీఆర్ అణగారిన పేద వర్గాల ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు.

ఆసరా పింఛన్ల కింద జిల్లాకు నెలకు రూ.32 కోట్లు ఇస్తున్నారన్నారు. పేదింటి ఆడ బిడ్డ పెళ్లికి నేనున్నానంటూ కళ్యాణ లక్ష్మి పథకం కింద లక్షా 16 వేలు ఇస్తున్నారని ,ఇలా ఎన్నో కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.

గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిందన్నారు. ఇది ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని అన్నారు.

భూమిలేని గిరిజనులకు గిరిజన బంధు ఇస్తామనీ తీసుకున్న సంచలనాత్మకమైన నిర్ణయం అణగారిన వర్గాల అభ్యున్నతి పట్ల సీఎంకు ఉన్న అభిమానానికి నిదర్శనం అన్నారు.

తెలంగాణ సచివాలయానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టారంటే దళిత వర్గాల పట్ల వారికున్న ప్రేమ, ఆదరాభిమానాలు వెలకట్టలేనివని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన హృదయ పూర్వక కృతజ్ఞతలు సి ఎం కు తెలిపారు.

జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో భూమికోసం ,భుక్తి కోసం పోరాడి ఎందరో అమరులైనారని, వారి త్యాగాల ఫలితమే నేడు స్వతంత్ర రాష్ట్రంలో స్వేచ్ఛగా బతుకుతున్నామన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని సమాజంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కుల మతాలు జాతి విభేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ముందడుగు వేసి రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలన్నారు.

తెలంగాణ చేనేత మరియు హ్యాండ్లూమ్స్ చైర్మన్ చింతా ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని పోరాటాలతో సాధించుకున్నామని, అలాంటి తెలంగాణను దేశంలో ఉన్నత స్థానంలో ఉంచాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అంకుటిత దీక్షతో పనిచేస్తున్నారన్నారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, రాష్ట్రాన్ని దేశంలోని రాష్ట్రాలన్నింటికీ ఆదర్శంగా నిలుపుతున్నారన్నారు. సమైక్యతను చాటుకునే అన్ని కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

అంతకుముందు స్వతంత్ర సమరయోధులకు, కవులు, రచయితలు, కళాకారులకు ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రమణ కుమార్, రాజార్షి షా, వీరారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నరహరి రెడ్డి, సి డి సి చైర్మన్ బుచ్చిరెడ్డి, డిసిసిబి వైస్ చైర్మన్ మాణిక్యం, డీఈవో రాజేష్, జిల్లా అధికారులు, ఆర్డిఓ, స్వతంత్ర సమరయోధులు, కళాకారులు, విద్యార్థులు, ప్రజలు ,తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ భాషలకు, విజ్ఞాన వ్యవస్థలకు ప్రాధాన్యం తప్పనిసరి: ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: తమిళనాడు రాష్ట్రం, తంజావూరు తాలూకా, తిరుమలైసముద్రంలోని శాస్త్ర విశ్వవిద్యాలయంలో జరిగిన 36వ స్నాతకోత్సవానికి కేంద్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి శాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరయ్యారు. కేంద్ర సమాచార ప్రసార శాఖ, మత్స్య, పశు సంవర్థక, పాడిపరిశ్రమ శాఖ సహాయమంత్రి ఎల్. మురుగన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ, నాణ్యమైన ఉన్నత విద్యను అందించేందుకు విశ్వవిద్యాలయ వైస్‌చాన్సిలర్ ప్రొఫెసర్ ఆర్. సేతురామన్ గత నాలుగు దశాబ్దాలుగా చేస్తున్న కృషి, ఆయన పడుతున్న తపన ఎంతో అభినందనీయమని అన్నారు. చదువుల కోవెలగా శాస్త్ర విశ్వవిద్యాలయం తన పేరును నిలబెట్టుకుందని, విజ్ఞానరంగంలో ప్రతిభను చాటుకుందని అన్నారు. మానవ శాస్త్రాలు, సాహిత్యం, చరిత్ర వంటి లిబరల్ ఆర్ట్స్‌ను బోధించే కోర్సుల్లో కూడా ఈ విశ్విద్యాలయం అధ్యయనం జరుపుతూ ఉండటం సంతోషదాయకమని అన్నారు. ప్రత్యేక కళలకు, వాస్తు శిల్పానికి, సంగీత, సాంస్కృతిక అంశాలకు ప్రసిద్ధి గాంచిన తంజావూరు ప్రాంతం, తమిళనాడు రాష్ట్రంలో ఈ కోర్సులు కూడా ప్రముఖ అధ్యయన విభాగాలే అవుతాయని అన్నారు.

తమిళనాడులోని అపురూపమైన దేవాలయాలు ప్రపంచంలోనే ఎన్నదగిన అద్భుతాలని, విశిష్టమైన నాగరికతకు భారతదేశం కాణాచి అనే వాస్తవాన్ని ఇవి అందరికీ గుర్తు చేస్తున్నాయని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఎంతో ఉత్కృష్టమైన, విభిన్నమైన విజ్ఞానసంపదకు తమిళనాడు ఆటపట్టు అని, 'గొప్పగా ఆలోచించు, పారదర్శకతతో ఆలోచించు' అన్న సిద్ధాంతాన్ని మనకు అందించిందని అన్నారు.

చరకుడు, సుశ్రుతుడు, ఆర్యభట్టు, భాస్కరాచార్యుడు, నాగార్జునుడు, తిరువళ్లువర్ వంటి గొప్ప మేధావులన ంచి, ఎంతో గొప్ప నాగరికతా సంప్రదాయాలను మనం పుణికి పుచ్చుకున్నామని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. భారతీయ విజ్ఞాన వ్యవస్థ ఎప్పటికీ అనుసరణీయమేనని, ప్రస్తుతం ప్రపంచ స్థాయిలో ఎదురవుతున్న సవాళ్లకు కూడా మన విజ్ఞాన వ్యవస్థ పరిష్కారాలను సూచిస్తోందని అన్నారు.

భారతదేశం ఒక విశిష్టమైన నాగరికతగా వచ్చే పాతికేళ్ళ కీలకపాత్ర పోషించబోతోందని, ప్రపంచ సంక్షేమం లక్ష్యంగా మన నాగరికతా సంప్రదాయాలను ప్రోత్సహించడం, పరిరక్షించడం, ముందుకు తీసుకెళ్లడం తదితర అంశాల్లో విద్యార్థులు ప్రముఖ పాత్ర పోషించవలసి ఉంటుందని కేంద్రమంత్రి సూచించారు. 2020వ సంవత్సరపు జాతీయ విద్యా విధానానికి శాస్త్ర విశ్వవిద్యాలయం పథనిర్దేశకంగా కూడా వ్యవహరించాలని ఆయన అన్నారు.

2020వ సంవత్సరపు జాతీయ విద్యావిధానం (ఎన్.ఇ.పి.) ముఖ్యాంశాలను కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. విద్యార్థులను, యువతను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దేందుకు వీలుగా భారతీయ విలువలు, సంప్రదాయాల ప్రాతిపదికతో విద్యావిధానం రూపుదాల్చినట్టు ఆయన చెప్పారు. భారతీయ భాషలు, విజ్ఞాన వ్యవస్థకు అది ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. తమిళనాడుకు చెందిన ప్రముఖ తత్వనీతిజ్ఞుడు తిరువళ్లువర్ మరే ఇతర సాహితీ వేత్తకు, పండితుడికి, తత్వవేత్తకు ఏ మాత్రం తీసిపోరని, ఆయన తత్వాన్ని, భారతీయ విజ్ఞాన వ్యవ్థను ప్రపంచ వ్యాప్తంగా విస్తరింపచేయడం మన కర్తవ్యమని మంత్రి అన్నారు.

ఉన్నత విద్యను అందించే ఉత్తమ అధ్యయన సంస్థగా పరిశోధన, ఆవిష్కరణ ప్రక్రియల్లో తన కృషిని శాస్త్ర విశ్వవిద్యాలయం ఎప్పటిలా కొనసాగించాలని కేంద్రమంత్రి సూచించారు. అభివృద్ధి, అధ్యయనంలో తగిన నమూనాలకు రూపకల్పన చేయడంలో, తద్వారా మానవాళిని గొప్ప భవితవైపు నడిపించడంలో శాస్త్ర విశ్వవిద్యాలయ సారథులు తగిన కృషి చేయగలరన్న ఆత్మవిశ్వాసం తనకు ఉన్నదని అన్నారు. డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాంతో పాటుగా, తమిళనాడుకు చెందిన పలువురు గొప్ప వ్యక్తుల విలక్షణ సంప్రదాయాలను విద్యార్థులు కొనసాగించడం ద్వారా శాస్త్ర విశ్వవిద్యాలయం దేశానికే గర్వకారణంగా నిలబడగలదని ఆయన అభిప్రాయపడ్డారు.

శాస్త్ర ఇంజినీరింగ్ కళాశాలలో, సృజనాత్మకమైన రీతిలో లోహపు విడిభాగాలను తయారు చేసే షణ్ముగ ప్రిసిషన్ ఫోర్జింగ్ యూనిట్‌ను కూడా కేంద్రమంత్రి సందర్శించారు. ఇనుపలోహంతో తయారీ, ఇనుముతో సంబంధం లేకుండా ఇతర లోహాలతో తయారీ (ఫోర్జింగ్) ప్రక్రియల్లో ప్రముఖ సంస్థగా ఈ యూనిట్ పేరుగాంచింది. నైపుణ్యాల అధ్యయనంలో కూడా ఈ సంస్థ ప్రసిద్ధి చెందింది. యువత విస్తృత ప్రయోజనాలే లక్ష్యంగా జాతీయ నాణ్యతా అర్హతల వ్యవస్థ (ఎన్.ఎస్.క్యు.ఎఫ్.) ప్రమాణాలకు అనుగుణంగా ఈ సంస్థ నైపుణ్య శిక్షణ కల్పించాలని ఫోర్జింగ్ యూనిట్ ప్రతినిధులకు కేంద్రమంత్రి ప్రధాన్ సూచించారు.

# తిరుమల కొండపైకి ఎలక్ట్రిక్ బస్సులు.. ట్రయల్ రన్ నిర్వహించిన అధికారులు

తిరుమల, సెప్టెంబర్ 19: తిరుమల కొండపై కాలుష్యాన్ని నివారించేందుకు ఏపీ ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను నడిపించాలని ప్లాన్ చేస్తోంది. ఈ క్రమంలో ఇవ్వాల (సోమవారం) తిరుమలలో ఎలక్ట్రిక్ బస్సుతో ట్రయల్ రన్ నిర్వహించారు. ఆర్టీసీ నిపుణులు ఈ బస్సులో ఎక్కి తిరుపతి నుంచి రెండో ఘాట్ రోడ్డు ద్వారా తిరుమలకు చేరుకున్నారు. ఎత్తైన ప్రదేశాలు, మలుపుల వద్ద ఎలక్ట్రిక్ బస్సు పనితీరు ఎట్లుంటుందన్న విషయాలను పరిశీలించారు.

ఇక.. ఏపీలో ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రభుత్వం ఒలెక్ట్రా గ్రీన్ టెక్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం 100 బస్సులను ఒలెక్ట్రా ఏపీఎస్ఆర్టీసీకి అందించాల్సి ఉంది. ఇప్పటికే పలు బస్సులు అలిపిరి డిపోకు చేరుకున్నాయి. ప్రత్యేకంగా శిక్షణ పొందిన డ్రైవర్లనే ఈ ఎలక్ట్రిక్ బస్సుల్లో డ్రైవర్లుగా నియమించనున్నారు.

# సంక్షేమ పథకాల అమలులో దేశానికే తలమానికం తెలంగాణ : కొప్పుల ఈశ్వర్



కరీంనగర్, సెప్టెంబర్ 19(నేటినిజం ప్రతినిధి): సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికి తలమానికంగా మారిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. సోమవారం ధర్మారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల వ్యాప్తంగా నూతనంగా మంజూరైన 1783 మందికి పెన్షన్ కార్డులను మంత్రి కొప్పుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ? ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆసరా పథకం ద్వారా లక్షలాదిగా పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద కొడుకులా ఆదుకునేందుకు ముందుకు వచ్చాడన్నారు. పేదలంతా గౌరవంగా బతకాలనే ఉద్దేశంతో భద్రతతో జీవించే ఆసరా పింఛన్లను అందిస్తున్నాడన్నారు.

57 ఏళ్ల వారికి కూడా పెన్షన్ సౌకర్యం కల్పించడం ద్వారా మరో 10లక్షల మందికి రాష్ట్రంలో ఆసరా పెన్షన్ అందుతుందన్నారు. దేశవ్యాప్తంగా వృద్ధులు, దివ్యాంగులకు మాత్రమే పెన్షన్లు ఇస్తుంటే, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు, చేనేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి ఆసరా లబ్ధిదారుడికి ఆసరా గుర్తింపు కార్డు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రిని విమర్శిస్తున్న బీజేపీ తమ పాలిత రాష్ట్రంలో ఇలాంటి సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదన్నారు. సంక్షేమ పథకాలను ఉచితాలని విమర్శలు చేస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రిని ప్రజలు ఆదరించి ప్రతిపక్ష పార్టీలు కుట్రలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ధర్మారం జడ్పిటిసి పద్మజ, ఎంపీపీ కరుణశ్రీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ- చైర్మన్ బుచ్చిరెడ్డి, పీఏసిఎస్ చైర్మన్లు, బలరాం రెడ్డి, బంధం రవి, వెంకట్ రెడ్డి, గ్రామాల సర్పంచ్‌లు, తహశీల్దార్, ఎంపిడిఓ, లబ్దిదారులు, ప్రజలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆర్జితసేవ, అంగప్రదక్షిణం టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్న టీటీడీ

తిరుమల, సెప్టెంబర్ 19: నవంబర్ నెలకు సంబంధించిన రూ.300/- ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్ల ఆన్‌లైన్ కోటాను సెప్టెంబరు 21న ఉదయం 9 గంటలకు టీటీడీ వెబ్‌సైట్‌లో విడుదల చేయనుంది. అదేవిధంగా నవంబర్‌లో కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకార సేవతో సహా ఆర్జిత సేవా టిక్కెట్లు సెప్టెంబరు 21 మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని టీటీడీ వెల్లడించింది. టిక్కెట్ల లభ్యతను బట్టి ఈ టిక్కెట్లు మొదట వచ్చిన వారికి మొదట కేటాయింపు ప్రాతిపదికన జారీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

నవంబర్ నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవా ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్లు సెప్టెంబర్ 21 నుండి అందుబాటులో ఉంటాయన్నారు. అక్టోబర్ నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్‌లు సెప్టెంబర్ 22న ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. అయితే బ్రహ్మోత్సవం తేదీలు అంటే అక్టోబర్ 1 నుండి 5వ తేదీ వరకు అంగప్రదక్షిణం టోకెన్లు కేటాయించబోమన్నారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి దీనికి తగ్గట్టు టిక్కెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ అధికారులు కోరారు.

# బీజేపీలో చేరిన పంజాబ్ మాజీ సీఎం అమరీందర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ సోమవారం బీజేపీ పార్టీలో చేరారు. అలాగే ఆయన పార్టీ పంజాబ్ లోక్ కాంగ్రెస్‌ను కాషాయ పార్టీలో విలీనం చేశారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి కిరణ్ రిజిజు బీజేపీ కండువా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించగా.. మరో కేంద్రమంత్రి నరేంద్ర తోమర్ సభ్యత్వాన్ని అందజేశారు. అంతకు ముందు అమరీందర్.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీ అయ్యారు.

ఇదిలా ఉండగా.. పంజాబ్ ఎన్నికలకు ముందు అమరీందర్ సింగ్ కాంగ్రెస్‌ను వీడి.. కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. అయితే, అమరీందర్ భార్య ప్రణీత్ కౌర్ పాటియాల ఎంపీగా గెలుపొందగా.. ఆమె కాంగ్రెస్‌లోనే కొనసాగనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కెప్టెన్ కాంగ్రెస్‌ను వీడి.. 'పంజాబ్ లోక్ కాంగ్రెస్' పేరుతో వేరు కుంపటి పెట్టుకున్నారు. అప్పట్లో ఆయన తనయుడు రణిందర్ సింగ్ బీజేపీతో సమన్వయం చేసుకుంటూ టికెట్ల పంపిణీలో కీలక పాత్ర పోషించారు. అయితే, పంజాబ్‌లో ఆప్ ప్రభంజనం ముందు కాంగ్రెస్, బీజేపీ సహా ఏ పార్టీ నిలువలేకపోయాయి.

ప్రస్తుతం పంజాబ్‌లో పార్టీని పటిష్టం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలోనే బలమైన సిక్కు నేత కోసం వెతుకున్నది. మాజీ సీఎం అమరీందర్‌కు ప్రధాని మోదీకి వ్యక్తిగతంగా మంచి సంబంధాలున్నాయి. అమరీందర్ కాంగ్రెస్ నుంచి రెండుసార్లు పంజాబ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. తాజాగా ఆయన బీజేపీలో చేరడంతో ఆయన పాత్రేంటి అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం ఆయన వయసు 80 సంవత్సరాలు. 75 సంవత్సరాలు పైబడిన నేతలకు బీజేపీ టికెట్లు ఇవ్వని విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీలో ఆయన పాత్ర ఏంటన్నది తెలియాల్సి ఉన్నది.

# ఆద'రణ' లేని అన్నలు

## - తెలంగాణలో పూర్తిగా ఆదరణ కోల్పోయిన మావోయిస్టులు : ఏఎస్పీ రోహిత్ రాజు



భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 19 (నేటినిజం ప్రతినిధి) : తెలంగాణ–చత్తీస్గడ్ సరిహద్దు ప్రాంతాల్లోని ఆదివాసి ప్రజల మద్దతును మావోయిస్టు పార్టీ పూర్తిగా కోల్పోయిందని భద్రాచలం ఏఎస్పీ రోహిత్ రాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అమాయకపు ఆదివాసి గిరిజనులపై దుశ్చర్యలకు పాల్పడుతున్న నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ నాయకులు తెలంగాణలో ప్రజల మద్దతును కోల్పోయారని అన్నారు. అమాయకుడైన కుర్నపల్లి ఉప సర్పంచ్ ఇర్పా రాముడును కిరాతకంగా చంపిన మావోయిస్ట్ పార్టీపై ఆదివాసీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారూ. ఈ ఘటనతో మావోయిస్ట్ పార్టీకి ఎలాంటి సహాయ సహకారాలు అందించొద్దని ఆదివాసీలు తీర్మానం చేసుకోవడం హర్షణీయం అన్నారు. పోలీసులను హతమార్చాలనే ఉద్దేశంతో ఆదివాసీ ప్రజలు మరియు పశువులు సంచరించే ప్రాంతాల్లో ల్యాండ్ మైన్స్, ప్రెషర్ బాంబులు, ఐఈడీ లు అమర్చడం ద్వారా ఆదివాసీలు మరియు నోరులేని మూగజీవాలు తమ ప్రాణాలను కోల్పోతున్నాయి. తునికాకు సేకరించే అమాయకపు ఆదివాసీ ప్రజలపై బెదిరింపులకు పాల్పడుతూ కట్టల చొప్పున బలవంతంగా వారి వద్ద నుండి వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. కష్టపడి జీవనం సాగించే సరిహద్దు ప్రాంత ఆదివాసీ గ్రామస్తులను నిషేధిత మావోయిస్ట్ పార్టీ నిర్వహించే మీటింగులకు బియ్యం, కూరగాయలు, సరకులతో హాజరుకావాలని, లేని యెడల ఒక్కో ఇంటికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తామని భయబ్రాంతులకు గురిచేస్తూ, వారిపై నిత్యం వేధింపులకు పాల్పడటం సరికాదని అన్నారు. అంతేకాకుండా కష్టపడి పని చేసుకునే ట్రాక్టర్ల యజమానుల వద్ద నుండి 3 వేల రూపాయలను బలవంతంగా వసూలు చేస్తూ వారి కష్టాన్ని దోచుకుంటున్నారని వెల్లడించారు. గతంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేసుకున్న మావోయిస్ట్ పార్టీ నాయకులు ఇప్పుడు గ్రామాల్లోకి అడుగుపెట్టే అర్హత కోల్పోయారని అన్నారు. అదేవిధంగా ఏజెన్సీ సరిహద్దు ప్రాంతాల్లోని మైనర్ బాలబాలికలను బలవంతంగా పార్టీలోకి చేర్చుకొని వారితో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ బాలల హక్కులను కాలరాస్తున్నారని వివరించారు. మావోయిస్టు పార్టీలో పనిచేసే మహిళలపై నాయకులు లైంగిక వేధింపులకు పాల్పడటం, క్రింది స్థాయి క్యాడర్ ను చిన్నచూపు చూసన్తూ వారితో బలవంతంగా పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. మావోయిస్టు పార్టీ నాయకుల తీరుకు విసిగిపోయి ఇప్పటికే చాలా మంది లొంగిపోవడం జరిగిందని, మరికొంతమంది జనజీవన స్రవంతిలో కలవడానికి సిద్ధంగా ఉన్నట్లు తమకు సమాచారం కలదని అన్నారు.

### మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు అండగా ఉంటున్న జిల్లా పోలీసులు

జిల్లాలోని చర్ల, దుమ్ముగూడెం, మండలాలతో పాటు ఇతర మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు పోలీసులు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఇటీవల సంభవించిన వరదల సమయంలో ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలకు ఎలాంటి నష్టం సంభవించకుండా ఎప్పటికప్పుడు పోలీసులు వారికి అండగా ఉన్నారని తెలిపారు. కరోనా వైరస్ వ్యాప్తి సమయంలో మారుమూల ప్రాంతాల్లోని గిరిజన ప్రజలందరికి వ్యాక్సిన్లను పోలీసుల చొరవతో పూర్తి స్థాయిలో వేయించడం జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని ఎప్పటికప్పుడు ఉచితంగా వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. అక్కడ గ్రామాల్లో బోర్లు వేయించడం, వారికి దోమ తెరలు, వాటర్ ఫిల్టర్లు మరియు విద్యార్థులకు బుక్స్, ఛార్జింగ్ లైట్స్, టీవీలను పంపిణీ చేయడం జరిగిందని తెలియజేసారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజలకు రవాణా సౌకర్యం నిమిత్తం దాదాపుగా అన్ని ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని అన్నారు.

ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాలను అడ్డుకుంటూ అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టులకు ఎవరైనా సహాయం చేస్తే, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఏఎస్పీ హెచ్చరించారు.

# సరళ సాగర్ ప్రాజెక్ట్‌లో చేప పిల్లలు వదిలిన మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, సెప్టెంబర్ 19: మత్స్యకారుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం మదనపురం మండలం సరళ సాగర్ ప్రాజెక్ట్‌లో ఉచిత చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే మత్స్యకారుల జీవితాలు మారాయన్నారు. సీఎం కేసీఆర్ మత్స్య సంపదను పెంచేందుకు పెద్ద ఎత్తున నిధులు నిధులు కేటాయించారన్నారు.

కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, వనపర్తి జిల్లా పరిషత్ చైర్మన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రచన సివిల్ సర్వీసెస్ కలకు అండగా ఉంటా : మంత్రి కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 19: ఆడపిల్లల విద్య విషయంలో అండగా ఉండేందుకు ఎప్పుడు ముందుండే కేటీఆర్ మరోసారి తన మంచి మనసుతో నిరుపేద విద్యార్థిని జీవితాన్ని నిలబెట్టారు. తల్లిదండ్రులు లేని రుద్ర రచన అనే ఇంజనీరింగ్ విద్యార్థిని చదువుకు అవసరమైన సహాయం చేసి ఆమె ఇంజనీరింగ్ పూర్తి అయ్యేలా చూశారు. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తండ్రియాల గ్రామానికి చెందిన రుద్ర రచన చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి స్థానిక బాలసదనంలో ఉంటూ జగిత్యాల ప్రభుత్వ బాలికల హైస్కూల్లో 10వ తరగతి వరకు చదివింది. ఆ తర్వాత హైదరాబాద్ యూసుఫ్ గూడాలోని స్టేట్ హోమ్ లో ఉంటూ పాలిటెక్నిక్ ని పూర్తి చేసింది. ఈసెట్ ప్రవేశ పరీక్ష ద్వారా హైదరాబాద్ సిబిఐటి కాలేజీలో కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్ లో ఇంజనీరింగ్ సీటు సంపాదించింది. అయితే తల్లిదండ్రులు లేని రుద్ర రచన తన ఇంజనీరింగ్ ఫీజులు చెల్లించలేకపోయింది. రుద్ర రచన ఆర్థిక ఇబ్బందులను సామాజిక మాధ్యమాల ద్వారా 2019లో తెలుసుకున్న కేటీఆర్, ఆమెను ప్రగతి భవన్ పిలిపించుకొని ఇంజనీరింగ్ చదువు పూర్తయ్యేందుకు అవసరమైన ఖర్చులను భరిస్తానని భరోసా ఇచ్చారు.

ఇచ్చిన మాట ప్రకారం రుద్ర రచన ఇంజనీరింగ్ ఫీజులు, హాస్టల్ సంబంధిత ఖర్చులను కేటీఆర్ వ్యక్తిగతంగా భరించారు. కేటీఆర్ ఆర్థిక సహాయంతో ఇంజనీరింగ్ చదువుతున్న రుద్ర రచన, ఇటీవల జరిగిన క్యాంపస్ ప్లేస్ మెంట్ లో నాలుగు ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాన్ని సాధించింది. ఈ సందర్భంగా ప్రగతి భవన్ లో మంత్రి కేటీఆర్ ను రుద్ర రచన కలిసింది. ఆమె చదువు, ఉద్యోగాల విషయం తెలుసుకుని కేటీఆర్ సంతోషపడ్డారు. తనకంటూ ఎవరూ లేకున్నా ఆత్మ విశ్వాసంతో రుద్ర రచన జీవితంలో విజయం సాధించిందని మెచ్చుకున్నారు. తల్లిదండ్రులు లేని తనకు మంత్రి కేటీఆర్ ఒక అన్నగా అండగా నిలబడ్డారని, తన కల సాకారం కోసం తండ్రిగా తపించారని రచన భావోద్వేగానికి లోనయింది. ఈ సంవత్సరం రాఖీ కట్టాలనుకున్నానని అయితే కేటీఆర్ కాలికి గాయం అయిందన్న విషయం తెలుసుకుని బాధపడ్డానని రుద్ర రచన చెప్పింది. తాను పొదుపు చేసుకున్న డబ్బులతో వెండి రాఖీ తయారు చేయించానన్న రచన, వాటిని కేటీఆర్ కు కట్టింది. రచన మాటలకు, అభిమానానికి మంత్రి కేటీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. రచన చేత రాఖీ కట్టించుకున్న తాను, ఆమె జీవితంలో మరింత స్థిరపడేందుకు చేసే ప్రతి ప్రయత్నానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. జీవితంలో అనేక కష్టాలు ఎదుర్కొని వాటిని సవాలుగా స్వీకరించి నాలుగు కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన రచన యువతరానికి ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్ పరీక్ష రాసి సివిల్ సర్వెంట్ కావాలన్నా తన లక్ష్యానికి అండగా ఉంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు. రచన చివరి సంవత్సరం ఇంజనీరింగ్ ఫీజు, హాస్టల్ బకాయిలను కోసం అవసరమైన మొత్తం నగదు సహాయాన్ని ఈ రోజు కేటీఆర్ అందించారు.

# అమిత్ షా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని కేంద్ర హోం సహకార శాఖ మంత్రి అమిత్ షా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు కమ్యూనిటీ హాస్టళ్లకు ప్రత్యేక వికలాంగులకు శుభ్రపరిచే యంత్రాలకు వివిధ పరికరాలను అందించారు. కేంద్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పలువురు ప్రముఖులు కూడా పాల్గొన్నారు.

అమిత్ షా తన ప్రసంగంలో, ఈ రోజు జాతికి ప్రపంచస్థాయి ఖ్యాతిని తెచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు అని అన్నారు. దేశంలోని కోట్లాది మంది పేదలు, అణగారిన, వెనుకబడిన నిరుపేదలకు సహాయం అందేలా, వారి పరిస్థితి మెరుగుపడేలా ప్రతి వ్యక్తి ఏదో ఒక ప్రాంతంలో సేవా కార్యక్రమాల్లో తమను తాము భాగస్వాములను చేయాలని ప్రధాని మోదీ కోరారు. మోదీ తన జీవితమంతా కష్టాల్లో ఉన్న ప్రజలకు సహాయం చేయడంలో అంకితం చేశారని హోం మంత్రి అన్నారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత 60 కోట్ల మంది పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. బీమా రూ. కోట్లాది మంది పేదలకు ఇల్లు, కరెంటు, మంచినీరు, మరుగుదొడ్లు, వంటగ్యాస్ సిలిండర్లతోపాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యం కోసం రూ.5 లక్షలు అందించారు.

పుట్టుక లేదా ప్రమాదం వల్ల కలిగే ఎలాంటి వైకల్యానికి గౌరవప్రదమైన పేరు పెట్టడమే ప్రధాని మోదీ చేసిన అతి పెద్ద పని అని కేంద్ర హోం, సహకార మంత్రి అన్నారు. అలాంటి వారిని దివ్యాంగులుగా పిలిచి పూర్తి గౌరవంతో జీవించే హక్కును మోదీ కల్పించారు. పూర్వం విశిష్టత ఉన్నవారిని కరుణతో చూసేవారు, ఇప్పుడు వారిని గౌరవంగా చూస్తున్నారు.

వికలాంగుల కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నో కార్యక్రమాలను రూపొందించారని అమిత్ షా అన్నారు. దృష్టి లోపం ఉన్నవారు కరెన్సీ నోట్లను గుర్తించడానికి వీలుగా ప్రతి రూపాయి నోటు కూడా బ్రెయిలీలో ముద్రించబడింది బ్రెయిలీ లిపిలో కరెన్సీని కూడా వ్రాసిన ఏకైక దేశం భారతదేశం. అంతే కాకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక వికలాంగులకు సులువుగా లిఫ్ట్‌లు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశామని, అలాగే ప్రజా రవాణాలో ప్రత్యేక వికలాంగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేశామన్నారు. భారత ప్రభుత్వంలోని సాంఘిక సంక్షేమ మంత్రిత్వ శాఖ కోట్లాది మందికి తమ జీవితాలను గడపడానికి సహాయాన్ని అందించిందని మంత్రి అన్నారు. ఈ రోజు చాలా మంది వికలాంగులకు అలాంటి కొన్ని మార్గాలు అందించడమైనది. అవి వారికి రోజువారీగా సహాయపడతాయని, వారు సమాజంలో గౌరవంతో బతుకుతారని వివరించారు.

# గిరిజనుల ఆరాధ్య దైవం సీఎం కేసీఆర్ : మంత్రి సత్యవతి



మహబూబాబాద్, సెప్టెంబర్ 19(నేటినిజం ప్రతినిధి): గిరిజనుల ఆరాధ్య దైవం సీఎం కేసీఆర్ అని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సోమవారం కురవి మండలంలోని శ్రీ వీరభద్ర స్వామి, భద్రకాళి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్రంలో 10 శాతం గిరిజన రిజర్వేషన్ పెంపు, గిరిజన బంధు ఆమలు చేస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్, వారి కుటుంబ సభ్యుల పేర్ల మీద అర్చన, అభిషేకాలు చేయించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ గారు గిరిజనుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ నడిబొడ్డున బంజారాహిల్స్‌లో సంత్ సేవాలాల్, ఆదివాసీ కుమ్రం భీమ్ ల ఆత్మగౌరవ భవనాలను ప్రారంభించారని మంత్రి గుర్తు చేశారు.

గిరిజన రిజర్వేషన్ పెంపుపై 2017లో అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదించి బిల్లును కేంద్రానికి పంపితే కాలయాపన చేసి, ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. పోడు భూముల సమస్య పరిష్కారాన్ని కోసం జీవో ఇచ్చామన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న గిరిజన ఆదివాసీలకు గిరిజన బంధు ప్రకటించి, వారి జీవితాల్లో వెలుగు నింపుతున్న కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో మంత్రి సత్యవతి రాథోడ్‌తో పాటు, జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, కురవి జడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, బయ్యారం పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, సర్పంచులు కొమ్మినేని రవీందర్, రంగమ్మ, నెహ్రూ నాయక్, హరి ప్రసాద్, భూక్యా జీవన్,వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్బండ వర్ణాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



రంగారెడ్డి, సెప్టెంబర్ 19: సీఎం కేసీఆర్ అన్ని కులవృత్తులకు ప్రాధాన్యమిస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీలో పరిధి రావిర్యాల పెద్ద చెరువులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాష్ట్రం ఏర్పడిన తర్వాత మిషన్ కాకతీయతో చెరువుల్లో పూడికతీత తీయటంతో అవి జలకళ సంతరించుకున్నాయి. గతంలో చేపల కోసం ఆంధ్ర మీద ఆధారపడే వాళ్లం. కానీ నేడు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంతో రాష్ట్రంలో మత్స్య సంపద పెరిగిందన్నారు.

రంగారెడ్డి జిల్లాలో కోటి 60 లక్షల చేప పిల్లలు వదలడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. రావిర్యాల పెద్ద చెరువులో ఒక్క రోజే 5 లక్షల చేప పిల్లలు వదులుతున్నామన్నారు. చేపల మార్కెటింగ్‌కు ఔట్ లెట్లు, ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్ వాహనాలను సబ్సిడీపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు.

సరఫరదారుడు తీసుకొచ్చిన చేప పిల్లలను నిశితంగా పరిశీలించి సైజ్, నాణ్యత ప్రభుత్వ నిబంధనల కు అనుగుణంగా ఉన్న చేప పిల్లలను మాత్రమే చెరువుల్లో వదలాలన్నారు. నిబంధనల ప్రకారం లేని చేప పిల్లలను తిరస్కరించాలని మంత్రి సూచించారు.

# రాహుల్ యాత్రపై రగడ

బెంగళూర్, సెప్టెంబర్ 19: బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలు, ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్య వంటి అంశాలపై ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు భారత్ జోడో యాత్రను చేపట్టిన రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ కాలినడకన యాత్ర సాగిస్తున్నారు. తమిళనాడులో సెప్టెంబర్ ఏడున ప్రారంభమైన జోడో యాత్ర ప్రస్తుతం కేరళలో సాగుతోంది.

ఇక రాహుల్ జోడో యాత్రకు జనసమీకరణపై కర్నాటకలో పీసీసీ చీఫ్ డీకే శివకుమార్, మాజీ సీఎం పార్టీ సీనియర్ నేత సిద్ధరామయ్య వర్గాల మధ్య కోల్డ్‌వార్ జరుగుతోంది. భారత్ జోడో యాత్రకు ప్రతి నియోజకవర్గం నుంచి 5000 మందిని సమీకరించాలని, ఈ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయడం లేదని మాజీ కేపీసీసీ చీఫ్ ఆర్వీ దేశ్‌పాండేపై డీకే శివకుమార్ మండిపడ్డారు. రాహుల్ యాత్ర కోసం సరైన ఏర్పాట్లు చేపట్టడంలో సిద్ధరామయ్య వర్గం సరిగ్గా పనిచేయడం లేదని డీకే ఆరోపించారు.

# ప్రజావాణి వినతులకు ప్రాధాన్యతనివ్వాలి



ఖమ్మం, సెప్టెంబర్ 19(నేటినిజం ప్రతినిధి): ప్రజావాణి వినతులకు ప్రాధాన్యత నిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వినతులు స్వీకరించారు. స్వీకరించిన వినతులను సంబంధిత శాఖ అధికారులకు పరిష్కారానికి ఆదేశాలు ఇస్తూ ఫార్వార్డ్ చేశారు. ఈ సందర్భంగా వేంసూరు చౌడవరం గ్రామం నుండి అల్లు సరిత తమ భూమి హైవే లో గ్రీన్ ఫీల్డ్ క్రింద సేకరణ చేయగా, భూమికి మాత్రమే పరిహారం ఇచ్చారని, భూమిలో ఉన్న బోరు, కేసింగ్, మోటార్లకు నష్టపరిహారం ఇవ్వలేదని ఇప్పించగలందులకు కోరగా, కల్లూరు ఆర్డీవోకు పరిశీలించి, చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మధిర మండలం మడిపల్లి గ్రామస్తులు సాదా బైనామా ద్వారా ఉన్న భూమిని పట్టేదార్ పాస్ పుస్తకాల్లో నమోదుకు కోరగా, మధిర తహసీల్దార్ కు పరిశీలనకు కలెక్టర్ ఆదేశించారు. స్థానిక సారధి నగర్ 48వ డివిజన్ నుండి కావేటి స్వప్న, తనకు డబల్ బెడ్ రూం ఇల్లు మంజూరుకు కోరగా, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కు చర్యలకై కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం కొత్త బస్టాండ్ నుండి కె. సీత తాను ఒంటరి మహిళనని, ఆసరా పెన్షన్ మంజూరుకు కోరగా విచారించి, చర్యలు తీసుకుంటామన్నారు. ఎర్రుపాలెం మండలం మొలుగుమాడు గ్రామం నుండి వేపూరి గోపాల్ రావు రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల నమోదుకు కోరగా, జిల్లా పౌరసరఫరాల అధికారిని చర్యలకై ఆదేశించారు. కామేపల్లి మండల కేంద్రం నుండి ఎస్కె. దాదాసాహెబ్ తన కుమారుడు ఎస్కె. షరీఫ్ పుట్టుకతో అంధుడని, ఉపాధికల్పనకు కోరగా, జిల్లా సంక్షేమ అధికారిని చర్యలకై కలెక్టర్ ఆదేశించారు. కొండ్రుపాడు గ్రామం సూరయ్య బంజార తాండ నుండి ధర్మసోతు భూలి రైతుభీమా మంజూరుకు కోరగా, జిల్లా వ్యవసాయ అధికారిని చర్యలకై కలెక్టర్ ఆదేశించారు. వినతులు పెండింగ్ లేకుండా చూడాలని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు స్నేహాలత మొగిలి, ఎన్. మధుసూదన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రావయ్యా.... శీనయ్యా...!

## - పినపాకలో పొంగులేటికి నీరా 'జనం'
## - పలకరింపులు... పరామర్శలతో సాగిన మాజీ ఎంపీ పర్యటన
## - ఆర్థికసాయాలతో పలు కుటుంబాలకు ఆసరా



భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 19 (నేటినిజం ప్రతినిధి) : జగమంతా... జనమంతా మెచ్చే నాయకుడు పొంగులేటికి పినపాకలో నీరాజనం' పలికారు. రావయ్యా... శీనయ్య అంటూ అపూర్వ స్వాగతంతో భారీ కారు, ద్విచక్రవాహనాల ర్యాలీని నిర్వహించారు. రావాలి శీనన్న... కావాలి శీనన్న అంటూ నినాదాలు చేశారు. పుష్పగుచ్చాలు ఇచ్చి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. సోమవారం భద్రాద్రికొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో తెరాస రాష్ట్ర నాయకులు, ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన పలకరింపులు... పరామర్శలతో కొనసాగింది. పర్యటనలో భాగంగా పినపాక మండలంలోని దుగినేపల్లి, చెగర్మల, ముకుందాపురం, భూపతిరావుపేట, జానంపేట, విప్పలగుంపు, దేవనగరం, సింగిరెడ్డిపల్లి, మద్దులగూడెం, వెంకట్రావు పేట, చింతల బయ్యారం, పాతరెడ్డిపాలెం, బయ్యారం, మల్లారం, రాజుపేట, గడ్డిగూడెం, పొట్లపల్లి, గడ్డంపల్లి, సీతంపేట, రావిశెట్టిగూడెం, ఉప్పాక గ్రామాలను, మణుగూరు మండలంలోని రామానుజవరం, విప్పల సింగారం గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో జరిగిన శుభ, అశుభ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆర్థికసాయాలను అందజేసి పలు కుటుంబాలకు ఆసరాగా నిలిచారు. ప్రజల ఆదరాభిమానాలే తనకు శాశ్వతం అని మరోమారు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో పొంగులేటి వెంట పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ మువ్వా విజయబాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, తెరాస రాష్ట్ర నాయకులు ఊకంటి గోపాలరావు,అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, తదితరులు ఉన్నారు.

# ఏపీలో బీజేపీ పోరు బాట ప్రారంభం

విజయవాడ, సెప్టెంబర్ 19: ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టి ప్రజలకు విషయం చేరవేసేందుకు బీజేపీ ఇవాల్టి నుంచి పోరా బాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. విజయవాడ నుంచి తమ యాత్రను ప్రారంభించారు. ప్రజల్లోకి వెళ్లడం ద్వారా కేంద్రం సాయంతో ఎలా రాష్ట్రాభివృద్ధికి పాల్పడుతున్నది వివరించేందుకు బీజేపీ సిద్ధమైంది.

బీజేపీ పోరు బాట యాత్రను ఏపీ బీజేపీ శాఖ చీఫ్ సోము వీర్రాజు ప్రారంభించారు. విజయవాడలోని సత్యనారాయణపురం శివాజీ కెఫె సెంటర్లో స్ట్రీట్ మీటింగ్‌తో యాత్ర మొదలైంది. ఇందు కోసం ప్రత్యేకంగా ఒక బస్సు, ప్రచార రథాన్ని సిద్ధం చేసుకున్నారు. ఇవాల్టి నుంచి ప్రారంభమైన పోరు బాట యాత్ర తొలి దశ అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు జరుగనున్నది. దాదాపు 15 రోజులపాటు బీజేపీ ముఖ్యనాయకులంతా ప్రజల్లో ఉండేలా ప్లాన్ చేసుకున్నారు. 175 నియోజకవర్గాల పరిధిలో దాదాపు 5 వేల బహిరంగ సభలు నిర్వహించనున్నది.

2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దాదాపు 5 వేల బహిరంగసభలు నిర్వహించేందుకు బీజేపీ సన్నద్ధమవుతున్నది. ఏపీ రాజకీయాల్లో వైసీపీకి ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు కావాల్సిన కార్యాచరణను సిద్ధం చేసుకుని ముందుకెళ్తున్నది.

